ప్రాణమిత్రులు

టెంపోరావ్

మోహన్ కారును శరవేగంగా పోనిస్తున్నాడు. నాగరాజు వెనక్కు చూస్తున్నాడు. పోలీసు జీప్ వెనకనే వస్తోంది.

పట్నందాటి ట్రంక్ రోడ్డమ్మట కారు దూసుకుపోతోంది. రోడ్డుకి యిటూ, అటూ అడవి ప్రదేశం.

"వాళ్ళు మన్ని వదుల్తారనే నమ్మకం లేదు నాకు!" అన్నాడు నాగరాజు.

"కారులో ఎక్కువగా పెట్రోలు లేదు. ఎంతదూరం వెళ్ళగలమో!" అన్నాడు మోహన్.

"మోహన్, మనం ఏదో చేస్తేగాని యీ డబ్బు మనకు దక్కదు. ఈ బాగ్ పట్టుకొని, దిగి, నువ్వు అడవి లోకి పారిపో! నేను కారును పోనిస్తాను. వాళ్ళు యీ కార్ను వెంటాడతారు. నేను దొరికిపోయినా ఫరవా లేదు. డబ్బు నీ చేతిలో వుంటుంది. తర్వాత మనం పంచుకోవచ్చు!" అన్నాడు నాగరాజు.

"నాగా, నీది గొప్ప హృదయం. నువ్వు దిగి అడవి లోకి పారిపో! వాళ్ళను నేను ముప్పతిప్పలు పెడ్తాను" అన్నాడు మోహన్.

"అలాగే చేద్దాం. నీ డబ్బు నా దగ్గర భద్రంగా వుంచుతాను."

"నా కుటుంబాన్ని కూడా నువ్వు జాగ్రత్తగా చూసుకోవాలి!"

"మోహన్, మనం ప్రాణస్నేహితులం. అంతా నేను చూసుకుంటాను" అన్నాడు నాగరాజు.

సడన్ బ్రేకుతో మోహన్ కారు ఆపాడు. నాగ రాజు బాగ్ తోసహా కిందికి దూకాడు. కారు దూసుకు పోయింది.

అడవి ప్రదేశంలోని చెట్లమధ్యకు నాగరాజు పరు గెత్తాడు. పోలీస్ జీప్ ఆగింది.

"ఎవరో యిక్కడ దిగినట్లున్నారు!" అన్నాడు జీప్ నడుపుతూన్న కాన్స్టేబుల్ రామన్.

"వాడికోసం యీ అడవిలో ఎక్కడ వెతుకుతాం? ఆ కార్ను ఆపి, వాడిని పట్టుకుంటే అంతా తెలిసిపో తుంది. జీప్ పోనీ, క్విక్!" అరిచాడు యిన్స్పెక్టర్ కాంత్.

జీప్ ముందుకు దూసుకుపోయింది. కారు నడుపు తూన్న మోహన్ రియర్ వ్యూ అద్దంలో చూస్తున్నాడు. జీప్ దగ్గరకొస్తోంది.

"స్టాప్! టైర్లు షూట్ చేస్తాం!" అరిచాడు యిన్స్పెక్టర్ కాంత్ లౌడ్ స్పీకర్ ద్వారా.

కాని మోహన్ ఆపలేదు. తెగించి తనూ, నాగరాజూ పట్టపగలు యిండియన్ బ్యాంకిని రెయిడ్ చేసి డబ్బుతో

బయటపడ్డారు. ఆ బ్యాగ్‌లో ఎంతుందో మోహన్‌కి తెలియదు. కాని పెద్ద మొత్తం వుంటుందని అతడి అంచనా. ఇటువంటి దోపిడీ చేయకుండా తనూ, నాగరాజూ సుఖంగా జీవించవచ్చు!

ఇన్‌స్పెక్టర్ బాండ్ చేతిలోని పిస్టల్ భయంకరంగా ధ్వనించింది. మోహన్ ఉలిక్కిపడ్డూ యాక్సిలేటర్ని తొక్కాడు. కారు వెనుకనున్న గ్లాసు పగిలి ముక్కలైంది. మోహన్ కారు విమానంలా పోతోంది.

కాని ఎక్కువ దూరం అతడు పోలేక పోయాడు. కారు టాంక్‌లోని పెట్రోలు అయిపోయింది. నిస్సహాయంగా అతడు పోలీసులకు లొంగిపోవలసి వచ్చింది.

ఇన్‌స్పెక్టర్ బాండ్ అతడి చేతులకు బేడీలు వేశాడు.

"నీతో వుండే వ్యక్తి ఎక్కడకు పోయాడు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నాకు తెలియదు" అన్నాడు మోహన్.

"అతడి పేరు?"

"సుబ్బరాజు."

"అడ్రెసు?"

"నాకు తెలియదు. అతడూ, నేనూ తాజ్‌లో గీతా హోటల్లో కల్సుకొనే వాళ్ళం" అన్నాడు మోహన్.

అతడివైపు ఇన్‌స్పెక్టర్ బాండ్ కోపంగా చూశాడు.

"డబ్బున్న బాగ్ పట్టుకొని అతడు పారిపోయాడు. అతడు తెలివైనవాడు. నిన్ను జైలుకి తోసేసి వాడు సుఖంగా వుంటాడు!" అన్నాడు బాండ్.

మోహన్ మాట్లాడలేదు. తననీ, నాగరాజునీ శత్రువులుగా చేయాలని యిన్‌స్పెక్టర్ ప్రయత్నం చేస్తున్నాడు. కాని అతడు నెగ్గలేదు. తనూ, నాగరాజు

ప్రాణమిత్రులు!

"స్టేషన్‌కి వెళ్ళాక తోలు ఒల్చి పీడిని మాట్లాడిస్తాను, పదండి" అన్నాడు యిన్‌స్పెక్టర్.

మోహాన్ని జీప్‌లో కూర్చోబెట్టి కాన్‌స్టేబుళ్ళు అతడి యిరువైపులా కూర్చున్నారు.

జీప్ పట్నంవైపు వెళ్ళిపోయింది.

2

లాకప్‌లో వున్న మోహాన్ని మాట్లాడించడానికి యిన్‌స్పెక్టర్ శాండ్ శతవిధాల ప్రయత్నించాడు. కాని మోహన్ మాట్లాడలేదు.

పోలీసు జీప్‌లో మోహాన్ని యిండియన్ బ్యాంక్‌కి తీసుకెళ్ళారు. అక్కడి మేనేజర్, గుమస్తాలు మోహాన్ని పోల్చారు.

"కాషియర్ మూర్తి ఎదిరిస్తే ఇతడే అతడిని కత్తితో పొడిచాడు" అన్నాడు మేనేజర్.

"అవును, సార్, యితడే" అన్నాడొక గుమస్తా.

మోహన్ మళ్ళా లాకప్‌లో వుంచబడ్డాడు. పోలీసు లాకప్‌లో వున్న మోహాన్ని చూడ్డానికి అతడి భార్య సుమిత్ర వచ్చింది.

వూచల బయట నిలబడి ఆమె అతడివైపు ఏడుస్తూ చూసింది. అతడామెవైపు సూటిగా చూశాడు. సమీపంలో ఎవ్వరూ లేరని అతడు గుర్తించాడు.

"సుమిత్రా, భయపడకు! జైలుకెళ్ళినా నేను బయటకు వచ్చేస్తాను. అంతవరకూ జాగ్రత్తగా వుండు. మన అబ్బిగాడికి యిదంతా తెలియకుండా చూడు!" అన్నాడతను.

"మీరు లేకుండా నేనెలా బతగ్గలను?" అందామె.

బయట పచార్లు చేసే కానిస్టేబులు దూరమైనదాకా అతడు మౌనం దాల్చాడు.

"నాగా నిన్ను చూసుకుంటాడు!" అన్నాడతను.

మరి కొంతసేపు మాట్లాడి ఆమె వెళ్ళిపోయింది.

ఆలోచిస్తూ మోహన్ గోడవారగా నేల మీద కూర్చున్నాడు. అతను ఆలోచిస్తున్నాడు. ఆ బాగ్‌లో ఎంతవుందో మొదట్లో అతడికి తెలియదు. కాని యాభై లక్షలు పైన పోయిందని యిన్‌స్పెక్టర్ బాండ్ తనతో అన్నాడు. తన వాటకు 25 లక్షలు వస్తుంది.

ఈపాటికి నాగరాజు తన యిల్లు వదిలి మరోచోటకు పోయివుంటాడు. ఆ డబ్బును కాపాడగల్గిన శక్తి సామర్థ్యాలు నాగరాజులో ఎక్కువగా వున్నాయి.

బయట బూట్ల చప్పుడు. పోలీసు కానిస్టేబుల్ రైఫిల్ పట్టుకొని పచార్లు చేస్తున్నాడు.

మరో వారం రోజుల్లో బ్యాంకి కాషియర్ హాస్పిటల్లో మరణించాడని మోహన్ విన్నాడు. అతడు గాభరాపడసాగాడు. కాని గాభరాపడి ఇప్పుడు తనేం సాధించగలడు?

రెండు సంవత్సరములు గడచేలోపల మోహన్‌కి యావజ్జీవిత కారాగార శిక్ష విధించబడింది. ప్రఖ్యాత లాయర్ అరుంధతీదేవి ఉరిశిక్ష పడకుండా అతడిని కాపాడింది. అతడి సహచరుడు దొరకలేదు. మొదట్లో కాషియర్ని అతడే పొడిచేడన్నవాళ్ళు ఆఖరికి అతడు కాకపోవచ్చు అన్నారు. బ్యాంకి మేనేజర్ యిద్దరూ పొడిచారన్నాడు.

మోహన్ సెంట్రల్ జైలుకి పంపబడ్డాడు. తన భార్య వచ్చి తనను చూస్తుందని అతడు ఎదురుచూసే

వాడు. కాని ఆమె రాలేదు. తన భార్య యేమైందో అతడికి తెలియకుండా జీవితం సాగిపోయింది.

అతడి భార్య సుమిత్ర ఏమైంది?

సుమిత్ర చదువుకొన్న యువతికాదు. భర్త కేసు సాగుతూండగా నాగరాజు రహస్యంగా ఆమెను కలుసుకున్నాడు.

"ఇప్పటి పరిస్థితుల్లో నువ్వూ, నీ కొడుకూ కలిసి ఉండడం మంచిది కాదు" అన్నాడతను.

"అయితే ఏం చేయమంటారు?"

"వాడిని అనాధాశ్రమంలో వదిలేయి. నువ్వు మరో వూరు వెళ్ళిపో. నేను నీకు కావలసిన డబ్బు అక్కడికి తెచ్చి యిస్తూ వుంటాను."

ఆమె అలాగే చేసింది. కొడుకును ఒక అనాధాశ్రమంలో చేర్పించి దిండివనం వెళ్ళిపోయింది. ఆమెకు నాగరాజు వందరూపాయలు ఇచ్చాడు. తర్వాత దిండివనం వచ్చి యిస్తానన్నాడు.

ఆమె అక్కడకు చేరుకొని అష్టకష్టాలూ పడింది. నాగరాజునుంచి డబ్బు రాలేదు. అతడికోసం మద్రాసు వెళ్ళడానికి ఆమె దగ్గర డబ్బులేదు. ఆ పరిస్థితుల్లో ఆమె ఒక ధనవంతుడి యింట్లో పనిమనిషిగా చేరింది.

ఒకనాటి రాత్రి ఆమెను త్రాచుపాము కాటేసింది. తెల్లారేలోపల ఆమె మరణించింది. చనిపోయేముందు ధనవంతుడు ఆమె సమీపంలో నిలబడి జాలిగా సుమిత్ర వైపు చూశాడు.

"నీవాళ్ళు యెవరేనా వుంటే చెప్పు! వాళ్ళను యిక్కడకు రమ్మంటాను" అన్నాడతను.

"నా కెవ్వరూ లేరు" అని ఆమె శాశ్వతంగా కళ్ళు మూసింది.

3

పన్నెండేళ్ళ తర్వాత మోహన్ జైల్లోంచి బయట కొచ్చాడు. ఏళ్ళ తరబడి జైల్లో వున్న అతడికి రోడ్డమ్మట స్వేచ్ఛగా నడుస్తూంటే విచిత్రంగా వుంది.

ఎక్కడ చూసినా ప్రజలు! తను జైల్లో వుండగా జనసంఖ్య బాగా పెరిగివుండాలి. పట్నంలో ఎన్నో మార్పులను అతడు గమనించాడు. పాతబడిన బిల్డింగ్ వుండేచోట నాలుగంతస్తుల భవనం కనబడ్తోంది. పట్నం బాగా మారిపోయింది.

ఆలోచిస్తూ అతడు నడుస్తున్నాడు. తన భార్య, కొడుకు, నాగరాజు రూపాలు అతడి మెదడులో కదుల్తున్నాయి. తన కొడుకు పెద్దవాడయి వుంటాడు. తన భార్య యెలా వుందో!

తిలక్ నగర్‌లో ఒకప్పుడు తను నివశించిన యింటి వైపు అతడు నడిచాడు. కాస్సేపట్లో యిన్నేళ్ళ తర్వాత తన భార్యను చూడబోతున్నాననే ఆశతో అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది.

తిలక్ నగర్ చేరుకున్నాడతను. చిన్న యింట్లో ఒక భాగంలో వుండేవాడతను. ఆ పాత కొంప ఎక్కడా లేదు.

కొత్త బిల్డింగ్స్ అందంగా కనిపిస్తున్నాయి. నాగరాజు కొత్త బిల్డింగ్‌ను కట్టించేదేమో!

కాస్సేపట్లో అతడి ఆశలన్నీ ఎగిరిపోయాయి. ఆ బిల్డింగ్‌లోని ఫ్లాట్లలో అనేకమంది నివశిస్తున్నారు.

సుమిత్ర పేరు యెక్కడా లేదు!

మోహన్ తిలక్ నగర్ అంతటా తిరిగాడు. కాని లాభం లేకపోయింది.

ఒక టీ కొట్టుముందు మోహన్ ఆగాడు. మూడు బన్నులు తిని, వేడి టీ తాగాడు. సిగరెట్ వెలిగించాడు. నీరసంగా రోడ్డమ్మట నడుస్తున్నాడు.

ఒక స్త్రీని చూసి అతడామె వైపు పరుగుత్తాడు.

"మీనాక్షీ! నేను గుర్తున్నానా?" అడిగాడతను.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"మోహన్‌లా వున్నావు" అందామె.

"అవును. పోల్చావు" అన్నాడతను ఆనందంగా.

ఒకప్పుడు ఆమె అతడింటికి పాలు యిచ్చేది. ఆ నేక మంది ఆమె దగ్గరే పాలు కొనేవారు. పాలల్లో ఎప్పుడూ నీళ్ళు కలపదని అందరూ చెప్పుకొనేవారు.

"నువ్వెక్కడుంటున్నావు?"

"మా ఇల్లు అమ్మేసి కొరటూరు పోయాను."

"ఇంకా పాల వ్యాపారం చేస్తున్నావా?"

"నాకు తెలిసింది అదొక్కటేగా!" అందామె.

"సుమిత్ర ఏమైందో తెలుసా?"

ఆమె ఏం చెపుతుందో అని అతను గాభరాపడ సాగాడు.

"ఆఖరి రోజుదాకా ఆమెకు పాలు నేనే పోశాను. ఆమె దిండివనం వెళ్ళిపోతున్నానని చెప్పింది. ఆ కుర్రాడిని అనాథాశ్రమంలో చేర్చేసింది."

అతను మౌనంగా ఆమెవైపు చూశాడు.

"ఆ యిల్లాలు ఏం చేస్తుంది పాపం? చుట్టుపక్కల వాళ్ళందరూ నీ గురించే మాట్లాడేవారు. దిక్కులేక అలా చేసిందామె."

"బాబుని ఏ అనాథాశ్రమంలో చేర్పించిందో తెలుసా?"

"అయినావరంలో వుందది" అందామె.

అతడామెకు దణ్ణం పెట్టాడు.

"ఈ పట్నం నాకు కొత్తగా అగుపిస్తోంది. నిన్ను చూసినందుకు చాలా సంతోషం. మళ్ళా నిన్ను కలుసుకుంటాను" అని ఆమె అడ్రెసు రాసుకున్నాడు.

మీనాక్షి వెళ్ళిపోయింది. ఆమెవైపు అలాగే చూస్తూ నిలబడ్డాడతను.

తన భార్య దిండివనం యెందుకు వెళ్ళిపోయింది? అది చిన్న ప్రదేశం. అక్కడకు వెళ్ళి ఆమెను గురించి కనుక్కోవాలి.

ఈ పట్నంలో నాగరాజు ఎక్కడున్నాడో అతడు తెల్సుకోవాలి. నాగరాజును కల్సుకుంటే తన భార్య ఎందుకు దిండివనం వెళ్ళిందో తెలుస్తుంది.

కొంత దూరం నడిచి అతడు బస్సులో కూర్చున్నాడు. అతడు ధరించిన దుస్తులు చాలా పాతవి. పక్క కూర్చున్నతడు అతడివైపు అనుమానంగా చూశాడు.

అయినావరంలో అతడు బస్సు దిగాడు. రోడ్డమ్మట నడవసాగాడు. ఆ ప్రాంతంలో ఒక అనాథాశ్రమం వుండాలని అతడికి గుర్తుంది.

ఏదో కారు యెదురుగా వస్తోంది. కారు నడుపుతున్న వ్యక్తి వైపు అతడు చూసి "నాగా!" అని అర్చాడు.

కాని కారు ఆగలేదు. ముందుకు దూసుకుపోయింది. కారు నంబర్ని అతడు గుర్తుంచుకున్నాడు. ఆ నంబర్నిబట్టి నాగరాజు యెక్కడుంటున్నాడో తను తెలుసుకోవచ్చు!

ఆ కారు నంబర్ని వల్లించుకుంటూ అతడు పేవ్మెంటమ్మట నడవసాగాడు.

శారదా అనాధాశ్రమం కాంపౌండులోకి అతడు నడిచాడు. మునుపటిలా లేదు. పెద్ద బిల్డింగ్. కాంపౌండు విశాలంగా వుంది.

మోహన్ సెక్రటరీ గదిముందు నిలబడ్డాడు.

"ఏం కావాలి?" అన్నాడొక నౌఖరు.

"సెక్రటరీతో మాట్లాడాలి."

"నీ పేరు?"

"మోహన్."

నౌఖరు లోపలకు వెళ్ళాడు. కాస్సేపట్లో తిరిగి వచ్చాడు.

"లోపలకు వెళ్ళు!"

అతడు మెల్లిగా లోపలకు నడిచాడు. కుర్చీలో ఒక వృద్ధురాలు కూర్చునివుంది. నవ్వుతూ ఆమె అతడివైపు చూసింది.

"కూర్చో బాబూ" అందామె.

అతడు కుర్చీలో కూర్చున్నాడు. ఆమెవైపు సూటిగా చూశాడు. ఆమె కళ్ళలో యేదో కాంతి! ఆమే యీ అనాధాశ్రమాన్ని స్థాపించి జయప్రదంగా నడుపుతోంది.

"బాగా అలిసిపోయినట్లున్నావు" అని ఆమె బెల్ నొక్కింది.

ఒక యువతి గదిలో కొచ్చింది.

"టిఫిన్, కాఫీ, మంచినీళ్ళు తీసుకొచ్చి అతడికియ్యి" అందామె.

ఆమె పట్టుకొచ్చి యిచ్చింది. ఆకలితో తిని, నీళ్ళు తాగి, కాఫీని సేవించి అతడామెకేసి చూశాడు.

"మీరు దేవతలాంటివారు! మీ సహాయం కావాలి నాకు" అన్నాడతను.

"ఏం కావాలో చెప్పు."

"పది, పన్నెండేళ్ళ క్రితం ఒక కుర్రాడిని ఒక స్త్రీ యిక్కడ చేర్చి వెళ్ళిపోయింది. అతడి పేరు రవి. అతడు మీకు గుర్తున్నాడా?"

"అదేమిటి బాబూ అలా అడుగుతావు! రవి పేరు తెలియనివాళ్ళు యీ అనాధాశ్రమంలో లేరు. చిన్న తనంలో రవి యిక్కడికి వచ్చాడు. చాలా బుద్ధిమంతుడు. ఆటల్లో, చదువులో, గుణంలో అందర్నీ మించి పోయాడు" అందామె.

"అతడిక్కడున్నాడా?" ఆత్రంగా అడిగాడతను.

"అతడు వుద్యోగంలో చేరి రెండు నెలలు అయింది. వుద్యోగం వచ్చాక వేరే గది తీసుకుని వుంటున్నాడు."

"అతడి అడ్రెసు తెలుసా?"

ఒక కాగితంమీద అతడి అడ్రెసు రాసి ఆమె యిచ్చింది.

"కాని యిప్పుడు అతను ఆ గదిలో వుండడు. ఆఫీసు పనిమీద తిరుపూర్ వెళ్ళాడు. రెండు మూడు రోజుల్లో తిరిగొస్తానన్నాడు."

"అతడిని చూసి చాలా కాలమైంది. అతడు యిప్పుడెలా వుంటాడో!" వాపోయాడతను.

ఆమె నవ్వుతూ టేబుల్ సొరుగు లాగి ఒక ఫోటో తీసి అతడికిచ్చింది. ఫోటోవైపు అతడు ఆత్రంగా చూశాడు.

"చూశావా బాబూ, అతడు నీలాగే వున్నాడు. వయస్సులో చిన్నవాడు. అంతే తేడా!" అందామె నవ్వుతూ.

ఆమె చెప్పింది నిజమే! రవి తన పుత్రుడని అందరూ క్షణంలో గ్రహించగలరు.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"అతడి తల్లి సుమిత్ర వచ్చి రవిని యిక్కడ చేర్పించింది. ఆమె మళ్ళా రాలేదు. నువ్వు రావడం ఇదే మొదటిసారి. మీ బిడ్డను నువ్వూ, సుమిత్రా ఎందుకిలా వదిలేశారు?" అడిగిందామె.

అతడు వెంటనే జవాబివ్వలేదు ఆమెవైపు బాధతో చూశాడు. కళ్ళమ్మట నీళ్ళు కారాయి.

"పరిస్థితులలా వచ్చాయమ్మా! అంతకంటె నేనేమీ చెప్పలేను. మీకు చాలా థాంక్స్. మిమ్మల్ని యెన్నడూ మరువను" అని అతడు లేచి బయటకు నడిచాడు.

4

తను చూసిన కారు నంబర్ని బట్టి మోహన్ తన పాత మిత్రుడైన నాగరాజు అడ్రెసు కనుక్కోగల్గాడు.

గేటు ముందు నిలబడి లోపలకు చూశాడు. దూరంలో పెద్ద మేడవుంది. కాంపౌండ్‌లో నాలుగైదు కార్లున్నాయి.

గేటు ముందు కూర్చున్న గూర్ఖా అనుమానంగా మోహన్‌వైపు చూశాడు.

"ఇక్కడ నుంచో కు పో! జావ్!" అన్నాడతను.

మోహన్ కొంచెం వెనక్కు తిరిగాడు. ఒకప్పుడు తనూ, నాగరాజూ ప్రాణమిత్రులు. కాని ఏళ్ళ తరబడి జైల్లో కూర్చుని తిరిగొచ్చాక ఆ భవనంలోకి వెళ్ళే ధైర్యం లేకుండా పోయిందతనికి.

తటాలున గూర్ఖా గేటును తెర్చాడు—ఒక కారు బయటకు వచ్చింది.

"నాగా!" అరిచాడు మోహన్ వుద్రేకంతో.

కారు ఆగింది. కారును నడుపుతూన్న నాగరాజు మాసిన దుస్తుల్లో నిలబడివున్న వ్యక్తివైపు చూశాడు.

"హై, మోహన్, రా కూర్చో!"

కారు ముందు తలుపు తెరిచాడతను. వేగంగా వెళ్ళి మోహన్ కూర్చున్నాడు. తలుపు మూసి నాగరాజు కారుని పోనిచ్చాడు.

పక్క కూర్చున్న మోహన్ చెయ్యిని గట్టిగా పట్టుకున్నాడు. కొంతసేపు యిద్దరూ మౌనంగా వుండి పోయారు.

"మోహన్ యిలా నీ పక్క కూర్చుంటే మన కారు వెనుక పోలీస్ జీప్ వచ్చిన దృశ్యం జ్ఞప్తికొస్తోంది!" అన్నాడు నాగరాజు.

"నాగా, ఎలా వున్నావు?"

"ఇంతవరకూ అన్నీ బాగున్నా, నువ్వు పక్కన లేవని రోజూ విచారించేవాడిని. ఇటువైన మనం విడిపోకూడదు."

"ఎప్పుడూ కలిసే వుందాం" అన్నాడు మోహన్.

"నిన్ను విడుదల చేస్తారని తెల్సుకుని ఆ రోజు కారులో వచ్చాను—జైలుకి కొంచెం దూరంలో కారాపి కూర్చున్నాను. కాని నువ్వు కనబడలేదు—చూసి, చూసి ఏడుస్తూ వెనక్కి వచ్చాను. అప్పటి నుంచీ పట్నంలో అన్నిచోట్లా నీ కోసం వెతుకుతూనే వున్నాను" అన్నాడు నాగరాజు.

"నేను కుడివైపు రోడ్డమ్మట నడిచిపోయాను" అన్నాడు మోహన్.

"జైలు యెడంవైపు రోడ్డుమీద నా కారుంది."

నాగరాజు కారు స్పీడు హెచ్చించాడు. ఓరగా మిత్రుడివైపు చూశాడు.

"మోహన్, యిటుపైన నీ వేషం మార్చాలి."

"తొందరెందుకు?"

"మోహన్, మన చేతుల్లో కొచ్చిన డబ్బును నేను బాగా పెరిగేటట్లు చేశాను. నీ వాటా యిరవైఐదు లక్షలు యిప్పుడు కోటి పైగా వుంటుంది. అనేక వ్యాపారాల్లో మన డబ్బును పెట్టాను. ఇటుపైన నువ్వు సుఖంగా జీవించవచ్చు!"

"నాగా, సుమిత్ర ఎక్కడుంది?"

"ఆ విషయం నన్ను అడక్కు! నేను నీకు చెప్పలేను!"

సీటుమీద అతడివైపు తిరిగాడు మోహన్. "ఎంత చేదు నిజమైనా నేను భరించగలను, నాగా" అన్నాడతను.

"నువ్వు జైలుకెళ్ళాక ఆమె నిన్ను మర్చిపోయింది. మరొకడితో లేచిపోయింది."

"ఎవరితో?"

నాగరాజు కాసేపు ఆలోచించాడు. కట్టెలమ్మే కన్నయ్య తన వ్యాపారం మానేసి, వూరు విడిచి వెళ్ళిపోయాడని అతడికి తెలుసు.

"కట్టెల కన్నయ్యతో" అన్నాడు నాగరాజు.

"సుమిత్ర తిండివనం వెళ్ళిందని పాలమ్మే మీనాక్షి చెప్పింది" అన్నాడు మోహన్.

"మొదట్లో వాళ్ళు తిండివనం పోయారు. పనిగట్టుకుని ఆ వూరు నేను వెళ్ళాను. ఆమె కళ్ళు తెరవడానికి ప్రయత్నించాను. అక్కడనుంచి మరెక్కడికో పోయారు

వాళ్ళు. ఆమెను నేను మళ్ళా చూడలేదు."

"నా కొడుకును అనాథాశ్రమంలో వదిలేసింది" అన్నాడు మోహన్.

"కామంలో గుడ్డిదైన స్త్రీకి భర్తా, కొడుకు గుర్తు వుంటారా!" అన్నాడు నాగరాజు.

ఒక రెడీమేడ్ షాపు ముందు నాగరాజు కారును ఆపాడు—దిగి యిద్దరూ లోపలకు వెళ్ళారు. ఒక పాంట్, స్లాక్ కొన్నాడు నాగరాజు.

"ఆ గదిలోకి వెళ్ళి వేసుకు చూడు, సైజు సరిగ్గా వుందో, లేదో" అన్నాడతను.

మోహన్ పక్కనున్న చిన్న గదిలోకి వెళ్ళాడు. పాంటు, స్లాక్ ధరించాడు.

"ఇప్పుడు బాగున్నావు. నీ పాత దుస్తుల్ని కవర్లో వుంచు. ఎవరికేనా యిచ్చేద్దాం" అన్నాడు నాగరాజు.

ఇద్దరూ షాపులోంచి బయటకు నడిచారు. సమీపంలో వున్న చెప్పుల షాపులోకి వాళ్ళు వెళ్ళారు.

"స్లిప్పర్స్ ఫర్ మై ఫ్రెండ్" అన్నాడు నాగరాజు అతడివైపు చూస్తూ. మోహన్‌కి కొత్త చెప్పులు కొన్నాడు నాగరాజు. ఇద్దరూ వెళ్ళి కారులో కూర్చున్నారు. నాగరాజు కారును పోనిచ్చి హోటల్ రియో కాంపౌండులో ఆపాడు.

5

నాగరాజు, మోహన్ వుషారుగా లంచ్ సేవిస్తున్నారు.

"ఎన్నేళ్ళ తర్వాత మనం మళ్ళా కలిసి తింటున్నాం! నాకు చాలా ఆనందంగా వుంది" అన్నాడు నాగరాజు.

"నాకూ అలాగే వుంది" అన్నాడు మోహన్.

"మోహన్, ఎంతో కష్టపడి యింతకాలం పాటు నీ డబ్బును జాగ్రత్తగా చూశాను. మనం మన అకౌంట్లు సెటిల్ చేసుకోవాలి. అదంతా రహస్యంగా జరగాలి."

మోహన్ అతనివైపు నవ్వుతూ చూశాడు.

"డబ్బు నా దగ్గరున్నా, నీ దగ్గరున్నా ఒకటే."

"నీది నీకిచ్చేయడం నా ధర్మం. నా బాధ్యత తీరుతుంది. ఆటుపైన కావలిస్తే మనం కలిసి వ్యాపారం చేయొచ్చు."

"అయితే ఏం చేద్దాం?"

నాగరాజు అతడివంక సూటిగా చూశాడు. "కొందరు పోలీసులు మఫ్టీలో నిన్ను వెంటాడుతూ వుండొచ్చు. జైలు నుంచి నువ్వు తిరిగొచ్చాక బ్యాంకి నుంచి మనం దోచుకున్న డబ్బు ఎక్కడుందో తెలుసుకోవాలని వాళ్ళ తాపత్రయం. అందువలన మనం మరోచోట కలుసుకుందాం."

"ఎక్కడ?"

"ఈ పట్నానికి యాభై కిలోమీటర్ల దూరంలో నేను పెద్ద తోట కొన్నాను. అక్కడ చిన్న యిల్లు కూడా కట్టించాను. అక్కడికి వెళ్ళి రెండు రోజులు వుందాం. అక్కడ నీకు రావలసినదంతా యిచ్చేస్తాను."

"అలాగే చేద్దాం."

"నువ్వు యిప్పుడు ఎక్కడ వుంటున్నావు?"

"చిన్న హోటల్లో. అజంతా లాడ్జి. మెడోస్ రోడ్డు."

"అక్కడే వుండు. రేపు పొద్దుటే నేను అక్కడికొస్తాను. కారులో యిద్దరం నా గార్డెన్స్ కు వెళ్దాం."

"గుడ్" అన్నాడు మోహన్.

నాగరాజు బిల్లు చెల్లించాడు. డైనింగు గదిలోంచి వాళ్ళిద్దరూ బయటకు నడిచారు.

నాగరాజు కారును పోనిచ్చాడు.

"ఇప్పుడు మనం అంతగా భయపడ నక్కర లేదు. మంత్రులతో, ఎమ్.ఎల్.ఏ.లతో నాకు బాగా పరిచయ ముంది. నా దగ్గరకు రావడానికి పోలీసులు భయపడ్తారు" అన్నాడు నాగరాజు.

"నువ్వు చెప్పింది విన్నాక నాకు ధైర్యంగా వుంది. ఈ లోకంలో జయించాలంటే డబ్బూ, హోదా రెండూ వుండాలి," అన్నాడు మోహన్.

నాగరాజు టైమ్ చూశాడు.

"నేను ఒక మంత్రిని కల్సుకోడానికి వెళ్ళాలి. ఆయనతో గంటసేపు మాట్లాలి. నిన్ను యెక్కడ దింపను?"

"ఇక్కడే దిగిపోతాను."

నాగరాజు కారు ఆపాడు. మోహన్ కిందకు దిగాడు. జేబులోంచి ఒక కార్డు తీసి అతడు మోహన్‌కి ఇచ్చాడు.

"రేపు నిన్ను కల్సుకుంటాను. ఈ లోపల యేదేనా కావలిస్తే ఈ నంబరుకి ఫోన్ చేయి."

"అలాగే" అన్నాడు మోహన్.

నాగరాజు కారును పోనిచ్చాడు. రోడ్డువారగా నిల బడి వుండిపోయాడు మోహన్.

కొంతసేపయ్యాక అతడు రోడ్డమ్మట నడవసాగాడు.

అరగంట పైగా అతడు నడుస్తూనే వున్నాడు. పేవ్ మెంట్ పక్కన కట్టలమ్మే కొట్టుంది. ఆ కొట్టును చూడగానే అతడికి కన్నయ్య, సుమిత్ర గుర్తుకొచ్చారు.

కొట్టు బయట ఒకతను నిలబడి వున్నాడు. అతడిని చూసి మోహన్ ఆశ్చర్యపోయాడు. కట్టెల కన్నయ్య!

కోపంగా అతను కన్నయ్యవైపు వెళ్ళాడు. కన్నయ్య అతడివంక సూటిగా చూశాడు.

"మోహనా?" అన్నాడతను.

"అవును, నేనే. సుమిత్ర, యెక్కడుంది?" అన్నాడతను.

అతడిని చూడగానే తలెత్తిన కోపం మరుక్షణంలో అణగిపోయింది. పదేళ్ళపైన తన్ని వదిలేసిన సుమిత్రకోసం తనెందుకు కోపం తెచ్చుకోవాలి!

"మీ రడిగేది ఏమిటి సార్?" అన్నాడతను.

"నువ్వా, నా భార్య సుమిత్రా లేచిపోయారని విన్నాను. ఆమెను ఎక్కడ వదిలేశావు?"

కన్నయ్య కోపంతో ఎగిరాడు.

"అలా నీకు చెప్పిన ఆ దొంగనాకొడుకు యెక్కడున్నాడు?"

"ఈ పట్నంలోనే."

"వాడిని యిక్కడకు తీసుకురా? చెప్పుతీసి కొడ్తాను. అబద్ధానికి కూడా హద్దుండాలి. ఆరుగురు పిల్లల తండ్రిని నేను. నీ భార్య మంచిది. మా యిద్దరి గురించీ అలా చెప్పడం అన్యాయం. నువ్వు, నేనూ సహించకూడదు. ఎవడా దొంగ వెధవ?"

కట్టెల కన్నయ్య రెచ్చిపోయాడు. అతడి చేయి పట్టుకున్నాడు మోహన్.

"నేను విన్నది నీకు చెప్పి నిన్ను బాధపెట్టినందుకు నన్ను క్షమించు. జైలుకెళ్ళి పన్నెండేళ్ళు అయ్యాక తిరిగొచ్చాను. ఎవడో దుర్మార్గుడు అలా చెప్పాడు. నీ

మూలంగా అతడు దుర్మార్గుడని నేను తెల్సుకోగల్గి నందుకు సంతోషిస్తున్నాను."

కన్నయ్య అడివైపు జాలిగా చూశాడు.

"నా మూలంగా నువ్వు మరొకటి కూడా తెల్సుకో గలవు. ఇక్కడి వ్యాపారం మూసేసి నేను దిండివనం వెళ్ళాను. అక్కడ ఒక ధనవంతుడి యింట్లో నీ భార్య పనిమనిషిగా వుండేది. ఒక రాత్రి త్రాచుపాము కర్చి ఆమె మరణించింది" అన్నాడతను.

"బతికుండగా ఆమె నీతో ఏదేనా చెప్పిందా?" అడిగాడు మోహన్.

"ఒకసారి మాట్లాడాను. ఎవడో దుర్మార్గుడు నిన్ను మోసగించాడని ఆమె చెప్పింది. కొంతకాలం తర్వాత నేను మద్రాసుకు తిరిగొచ్చి యిక్కడ వ్యాపారం పెట్టాను."

కన్నయ్యను అతను అమాంతంగా కౌగలించు కొన్నాడు.

"కన్నయ్యా, ఎంతో చెప్పి నా కళ్ళు తెరిచావు! నువ్వు యిదంతా చెప్పకపోతే మనుషులను మునుపటిలాగే నమ్మి మోసపోయేవాడిని" అన్నాడు మోహన్.

"లోపలకొచ్చి కాఫీ తాగి వెళ్ళు" అన్నాడు కన్నయ్య.

ఇద్దరూ లోపలకు వెళ్ళారు. ఒక కుర్రాడిని పిల్చి కన్నయ్య కాఫీ తెమ్మన్నాడు.

కుర్చీల్లో వాళ్ళు ఎదురెదురుగా కూర్చున్నారు.

"నీకలా చెప్పినవాడిని కసితో తన్నాలనిపిస్తోంది" అన్నాడతను.

"ఆ పని నేను చస్తానులే. మనిద్దరి తరఫునా నేను

వాడికి బుద్ధి చెప్తాను."

కాఫీ వచ్చింది. ఇద్దరూ కాఫీ తాగారు. కన్నయ్య అతడివైపు సూటిగా చూశాడు.

"పేపర్లలో నీ గురించి ఎంతో రాసేవారు. యాభై లక్షలు పైన పోయిందటగా? అదంతా ఏమైంది?"

మోహన్ అదోలా నవ్వాడు.

"అదంతా చేసినవాళ్ళు యెందరో వున్నారు. నేను దొరికాను. నన్ను జైల్లో పడేశారు. తతిమావాళ్ళు యేమయ్యారో, డబ్బు ఏమైందో నీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు."

"అలా వచ్చిన డబ్బు నిలవదు! లక్ష్మిని జుత్తు పట్టుకొని బలాత్కారంగా లాక్కొస్తే మనింట్లో వుండదు. మరుక్షణంలో జారిపోతుంది" అన్నాడు కన్నయ్య.

"ఎన్నో నిజాలు ఆలస్యంగా నేర్చుకున్నాను" అని మోహన్ లేచాడు.

మెల్లిగా బయటకు నడిచాడు. నాగరాజు ముఖం అతడి మనోఫలకంమీద కదల్తోంది. అతడు తనని మోసం చేశాడు. సందేహం లేదు! అతడిని శిక్షించాలి!

6

అజంతా లాడ్జిముందు నాగరాజు కారును ఆపాడు. అతడు దిగేలోపల ప్లాస్టిక్ బాగ్ పట్టుకొని మోహన్ కారువైపు నడిచాడు.

"రెడీగా వున్నావన్నమాట!" అన్నాడు నాగరాజు టైమ్ చూస్తూ.

మోహన్ ముందుసీటులో కూర్చుని తలుపు మూశాడు. నాగరాజు కారును పోనిచ్చాడు.

"ఈ లాడ్జిలోని గది ఖాళీ చేశావా?"

"వాళ్ళ బిల్లు సెటిల్ చేసేశాను. మళ్ళా యిక్కడ వుండవలసిన అవసరం నాకు రాకపోవచ్చు" అన్నాడు మోహన్.

"వెల్ సెడ్ మై ఫ్రెండ్!" అన్నాడు నాగరాజు.

టైమ్ ఏడుకావస్తోంది. తన తోటవైపు నాగరాజు కారును పోనిచ్చాడు.

"మోహన్, ఇప్పుడు మనం రహస్యంగా మాట్లాడుకోవచ్చు. నువ్వు జైల్లో వుండగా మన డబ్బును కాపాడ్డానికి నేను ఎంతో కష్టపడ్డాను. రెండేళ్ళదాకా నేను ధనవంతుడిలా యెవ్వరికీ కనిపించలేదు."

కారును ఆపి సిగరెట్ కేసు తెర్చి మోహన్ కి సిగరెట్ ఇచ్చి నాగరాజు మరో సిగరెట్ వెలిగించాడు.

"మోహన్, యిప్పుడు నీ చేతిలోకి చాలా డబ్బు వస్తుంది. ఏం చెయ్యదల్చావు? మళ్ళా వెళ్ళాడ్తావా?" అడిగాడు నాగరాజు.

"నేనింకా ఆలోచించలేదు" అన్నాడు మోహన్.

"నీకొక పెద్ద మేడ నేను యిస్తాను. అది ప్రస్తుతం మరొకరి పేరులో వుంది. నీకోసం అది నేను కొన్నాను. అంత పెద్దింట్లో నువ్వు ఒంటరిగా వుంటే పిచ్చెక్కిపోతుంది. నీ భవిష్యత్తును గురించి నువ్వు అంతా ప్లాన్ చెయ్యాలి" అన్నాడు నాగరాజు.

"ఆలోచిస్తాను" అన్నాడు మోహన్ క్లుప్తంగా.

నాగరాజు తోటలో కారును ఆపాడు. చిన్న బంగళా వుంది. హాలు, రెండు పడగ్గదులు, వంట గది, బాత్ రూమ్, ఎలక్ట్రిక్ అన్నీ ఆధునికంగా అమర్చబడ్డాయి.

ఇద్దరూ హాల్లో కూర్చున్నారు. పైన ఫాన్ తిరుగుతోంది.

"ఇక్కడ కరెంటు లేదు. అందుకని యమాహా జన రేటర్ కొన్నాను" అన్నాడు నాగరాజు.

అరగంట తర్వాత యిద్దరూ నలువైపులా తిరిగి తోటను చూశారు. అక్కడ అరడజనుమంది పని చేస్తు న్నారు.

ఒంటిగంట ప్రాంతంలో ఇద్దరూ భోజనాలు చేశారు. కేరియర్లలో పెట్టించి నాగరాజు అనేక పదార్థాలు చేయించి తెచ్చాడు.

"నీ కిష్టమని చికెన్ బిర్యానీ చేయించాను" అన్నాడు నాగరాజు.

మోహన్ నవ్వాడు.

"జైలులో రుచీపచీలేని పదార్థాలు తినితిని నాలిక చచ్చిపోయింది" అన్నాడు మోహన్.

భోజనాలు ముగించి యిద్దరూ పడుకున్నారు. వాళ్ళు లేచేసరికి ఆరుదాటింది.

కాఫీ సేవించి యిద్దరూ కొంతసేపు తోటలో పచార్లు చేశారు. పని చేసే నౌఖర్లు ఎక్కడా లేరు.

"పొద్దుట మనం చూసిన పనివాళ్ళు యెక్కడకు పోయారు?" అడిగాడు మోహన్.

"సమీపంలోనే వున్నాయి వాళ్ళ ఇల్లు. అక్కడకు పోయి మళ్ళా పొద్దుటే వస్తారు" అన్నాడు నాగరాజు.

చీకటి పడింది. హాల్లోని లైట్లు వెల్గుతున్నాయి. ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు. స్కాచ్ విస్కీ బాటిల్ తీసి నాగరాజు టీపాయిమీద వుంచాడు. సోడా బుడ్లు, రెండు గ్లాసులు, ఒక కూల్ బాక్స్ వంటగది లోంచి అతడు తెచ్చాడు.

రెండు గ్లాసుల్లో విస్కీ పోసి, సోడా కలిపి ఐస్

ఫ్యాబ్స్ పడేశాడు. ఆప్యాయంగా మెరిసే కళ్ళతో మోహన్ వైపు చూశాడు.

"మోహన్, లెటస్ డ్రింక్ ఫర్ విక్టరీ!" అన్నాడు.

ఇద్దరూ గ్లాసులు అందుకున్నారు. రెండు పెగ్గులు సేవించారు. వుషారుగా వున్నారు.

నాగరాజు అతడివైపు చూశాడు.

"ఇప్పుడు బిజినెస్‌కి వస్తాను. ఒక్క విషయం నేనింత వరకూ నీకు చెప్పలేదు. నీ వాటాకు రావలసిన డబ్బు నేను నీ భార్య సుమిత్రకు అప్పుడే యిచ్చేశాను!" అన్నాడు నాగరాజు.

"ఎవరు యిమ్మన్నారు?"

"ఇవ్వకపోతే నన్ను పోలీసులకు అప్పగిస్తానంది. మరేం గత్యంతరంలేక యివ్వవలసి వచ్చింది" అన్నాడు నాగరాజు.

"యూ ఆర్ ది బిగ్గెస్టు లయర్!" అరిచాడు మోహన్.

"నువ్వు యేమనుకున్నా నాకు కేర్ లేదు. నీ వాటా డబ్బు యిచ్చేసి నా బాధ్యత తీర్చుకున్నాను. ఇదంతా మొదటే చెప్తే గుండాగి చస్తావని చెప్పలేదు."

"నా భార్య సుమిత్ర కట్టెల కన్నయ్యతో లేచి పోయిందన్నావు. అటువంటి దానికి అంత డబ్బు ఎలా యిచ్చావు?"

"ఆమె లేచిపోయేముందు యిచ్చాను."

మోహన్ గ్లాసులోని విస్కీని తాగేశాడు.

"అంత డబ్బు తీసుకొని సుమిత్ర దండకవనం వెళ్ళి పోయి అక్కడ ఒక ధనవంతుడి యింట్లో పనిమనిషిగా చేరిందా? నేను నమ్మను!"

"ఆమెకు నేనిచ్చిన డబ్బంతా ఆ కన్నయ్యగాడు లాగేసి పారిపోయి వుండొచ్చు!"

"నాగా!" అర్చాడు మోహన్, కుర్చీలోంచి లేస్తూ.

"ఏమిటి?" అడిగాడు నాగరాజు.

"కట్టెల కన్నయ్య యీ పట్నంలోనే వున్నాడు. నిన్న నువ్వు నన్ను దింపి వెళ్ళిపోయాక విచిత్రంగా అతడు కనిపించాడు. నీ మాటలు నమ్మి అతడిని తిట్టాను. తర్వాత నిజం తెల్సుకొని సిగ్గుతో తలొంచి నిలబడ్డాను."

మోహన్ చెప్పింది విని నాగరాజు తృళ్ళిపడ్డాడు. కట్టెల కన్నయ్య అతడికి ప్రత్యక్షమవుతాడని కలలో కూడా వూహించలేదతను.

"నాగా, నువ్వు నన్ను మోసగించావు. నా కొడుకును అనాథాశ్రమంలో వదిలేసి, నా భార్య దిండివనం వెళ్ళిపోయింది. అక్కడ పనిమనిషిగా వుండి జీవించింది. చివరకి పాముకాటుకు బలై ఆమె మరణించింది. ఆమెకు నువ్వు పైసాకూడా యివ్వలేదు. అందుకే ఆమె పేదరికంలో బతకవలసి వచ్చింది."

"అయితే ఏమంటావు?"

"నా డబ్బు నాకిమ్మంటాను. ఈ పన్నెండేళ్ళలోనూ అది పెరిగి కోటి రూపాయిలు అయిందన్నావు. అది నాకిచ్చేయి!"

నాగరాజు పకపక నవ్వాడు.

"ఒక పైసా యివ్వను. ఏం చెయ్యగలవు?"

"నాగా, నీకోసం, నిన్ను కాపాడ్డానికి నేను జైలు కెళ్ళాను. నీ సహచరుడెవరని పోలీసులు నన్నెంతకొట్టినా నీ పేరు చెప్పలేదు. నన్ను మోసం చెయ్యకు. నాకు కోటి రూపాయిలు వద్దు. కనీసం నా వాటాకొచ్చే 25

లక్షలు యిచ్చేయి. మన స్నేహాన్ని పాడు చెయ్యకు!"

నాగరాజు విస్కీ తాగి అతడివైపు పిస్టల్ని గురి పెట్టాడు. నవ్వుతూ లేచాడు.

"మోహన్, చేతులెత్తు! ట్రిగ్గర్ నొక్కితే నీ తల పగులుంది" అర్చాడు నాగరాజు.

మోహన్, చేతులెత్తాడు. కాలో విస్కీ గ్లాసును తన్ని అమాంతంగా బయటకు పరుగెత్తాడు.

అతడివైపు రెండుసార్లు షూట్ చేశాడు నాగరాజు. మోహన్ అమాంతంగా కిందపడ్డాడు. దొర్లుతూ కొంచెం దూరం కదిలాడు. కాస్సేపట్లో అతడు బాధపడుతున్నట్టు అర్చాడు.

నాగరాజు అతడిదగ్గర కెళ్ళాడు. టార్చి కాంతిలో మోహన్ వైపు చూశాడు.

మోహన్ వెల్లకిలా పడున్నాడు. అతడు ధరించిన చొక్కా ఎర్రగా, రక్తమయంగా అగుపిస్తోంది.

"శని విరగడైంది" అనుకుంటూ నాగరాజు హాల్లోకి వెళ్లాడు. గ్లాసులో విస్కీ పోసుకొని గడగడ తాగేశాడు.

తన వస్తువులన్నీ కారులో పెట్టుకున్నాడు. సిగరెట్ వెలిగించి కారును పోనిచ్చాడు. గేటు ప్రాంతంలో కారు ఆపాడు.

వస్తాదులా వున్న వాచ్ మన్ కారు దగ్గరకు వచ్చాడు.

"భీమా, యింటి ముందు వాడు చచ్చిపడున్నాడు. గొయ్యితీసి వాడిని పాతేయి. పైన మొక్కలు నాటు. హాలు సుభ్రంచేసి, యింటికి తాళంవేయి."

"అలాగేనయ్యా. అదంతా నేను చూసుకుంటాను."

నాగరాజు జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి అతడికిచ్చాడు.

"ఇదుంచుకో! రెండు మూడు రోజుల తర్వాత నేను వస్తాను. అంతా చూశాక మరో వెయ్యి నీకిస్తాను" అన్నాడు నాగరాజు.

"అలాగేనయ్యా" అన్నాడు వాచ్‌మన్.

నాగరాజు కారును పోనిచ్చాడు. వేగంగా కారు పట్నంవైపు ప్రయాణం చేస్తోంది. అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

ఈ లోకంలో మోహన్‌కి ఎవ్వరూ లేరు. అతడి మరణాన్ని యెవ్వరూ గుర్తించరు. తనకు బెంగలేదు! పాము కాటుకు గురై సుమిత్ర మరణించిందని అతడికి తెలుసు. తను ఎన్నేళ్ళుగానో భయపడే మోహన్ ఈ లోకంలో లేడు. తను యిటుపైన యే బెంగా లేకుండా హాయిగా జీవించవచ్చు! అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

కారు పట్నంవైపు దూసుకుపోతోంది.

7

నాగరాజు విస్కీ సేవిస్తున్నాడు. గదిలో ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. అతడి భార్య రమాదేవి పక్కనే కూర్చునివుంది.

టెలిఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ని అందుకొని "హలో!" అన్నాడు.

"మిష్టర్ నాగరాజ్, నీ సహచరుడు మోహాన్ని షూట్ చేసి చంపావు. అదంతా నేను చూశాను. మోహన్ శవం నా దగ్గర వుంది. నువ్వు నేను చెప్పినట్లు చేయకపోతే ఆ శవాన్ని పోలీసులకు అప్పగించవలసి వస్తుంది" అందో కంఠం.

నాగరాజు గుండె దడదడలాడింది.

"ఎవరు నువ్వు?"

"పేరు చెప్పినా నువ్వు గుర్తించలేవు!"

కాసేపు నాగరాజు మాట్లాడలేదు. శని విరగడ అయిందని తను అనుకున్నాడు, కాని మళ్లీ శని దాపరించింది.

"మిస్టర్ నాగరాజ్!"

"నీకేం కావాలి?"

"నీ మిత్రుడు నాకంతా చెప్పి కళ్ళు మూశాడు. అతడికివ్వవలసినదంతా నాకివ్వాలి రొఖ్ఖంగా!"

"ఎంత?"

"మొదట్లో 25 లక్షలియ్యి. ఇంకా యెంతివ్వాలో తర్వాత చెప్తాను."

"అతడిని నేను చంపినట్టు రుజువులేదు!"

అటువైపు వ్యక్తి నవ్వాడు.

"నువ్వు రెండుసార్లు షూట్ చేసినప్పుడు నాతో యెవ్వరూ లేకపోవచ్చు. అయినా నీ గురించి నేను చెప్తే గతంలో జరిగినదంతా బయటకు వస్తుంది. నువ్వు ఎందుకు అతడిని చంపావో అప్పుడు అర్థమవుతుంది. ఇద్దరూ కలిసి బ్యాంకిని దోచారు. పాపం, అతడు జైలుకెళ్ళి పన్నెండేళ్ళ తర్వాత తిరిగొచ్చాడు. నువ్వు సుఖంగా జీవితాన్ని సాగిస్తున్నావు!"

"నీకా డబ్బు యెలా యివ్వాలి?"

"రొఖ్ఖంగా డబ్బు రెడీగా వుంచు. 25 లక్షలు. నాకెలా ఇవ్వాలో తర్వాత చెప్తాను. పిచ్చివేషాలు వేస్తే తర్వాత చాలా కష్టపడ్తావు."

అటువైపున రిసీవర్ పెట్టేసిన శబ్దం వినపడింది. నాగ

రాజు సోఫాలో కూర్చున్నాడు. రమాదేవి అతడివైపు గాభరాగా చూసింది.

"ఏమిటలా వున్నారు? ఏమైంది?"

"ఏమీ కాలేదు. గ్లాసులో విస్కీ పోయి. నన్ను డిస్టర్బ్ చెయ్యకు" అన్నాడతను.

ఆమె గ్లాసులో విస్కీ పోసి బయటకు వెళ్ళిపోయింది. అతడు విస్కీ తాగుతూ ఆలోచించసాగాడు?

ఎవరతను? తన తోటలో అతడు ఆ రోజున ఎలా వున్నాడు? ఇప్పుడు తనేం చెయ్యాలి?

టెలిఫోన్ మ్రోగింది.

"హలో, నాగరాజు" అన్నాడతను.

"మిస్టర్ నాగరాజ్, నన్ను యెలా చంపాలా అని నువ్వు ఆలోచిస్తూ ఉండొచ్చు. కాని నన్ను నువ్వు చంపలేవు! మోహన్‌లా నీ చేతుల్లో నేను చావను!"

"నిన్ను చంపాలనే ఉద్దేశం లేదు నాకు."

"డబ్బు యివ్వడానికి సిద్ధంగా వున్నావా?"

"యిస్తాను."

"రేపు మూడింటికి అన్నాదురై విగ్రహం దగ్గరవున్న సబ్ వేలోకి దిగి అక్కడ నిలబడు. ఎర్రటి నెక్ టై వేసుకో. ఒక యాంగ్లో ఇండియన్ యువతి నిన్ను పోల్చి, నీ దగ్గరకొస్తుంది. తెచ్చావా అంటుందామె. తెచ్చాననను. డబ్బున్న బాగ్ ఆమెకియ్యి. పదినిమిషాల్లో ఆమె నేనున్న చోటుకి వస్తుంది. ఆమె అలా రాకపోతే మోహన్ శవాన్ని పోలీసులకు అప్పగిస్తాను."

"అలాగే చేస్తాను" అన్నాడు నాగరాజు.

"మిస్టర్ నాగరాజ్, ఆ యాంగ్లో ఇండియన్ యువతిని పట్టుకొని ఆమెద్వారా నేనెక్కడున్నానో

తెలుసుకోడానికి ప్రయత్నించకు. ఆమెకు నా గురించి తెలియదు."

"నేనటువంటిదేదీ చెయ్యను. ఆమెకు డబ్బిచ్చి నా తోవన వెళ్ళిపోతాను."

"గుడ్! డబ్బు నాకు అందగానే నీకు ఫోన్ చేసి చెప్తాను" అని అతడు రిసీవర్ పెట్టేశాడు.

నాగరాజు మళ్ళా గ్లాసులో విస్కీ పోసుకొని తాగుతూ కూర్చున్నాడు. అతడు ఆలోచిస్తున్నాడు. అక్కడ ఏం జరిగిందో తను వెళ్ళి వాచ్‌మన్‌తో మాట్లాడి కనుక్కోవాలి.

వెలుగు వచ్చేముందు అతడి కారును తోటవైపు పోనిచ్చాడు.

తోటలో కారాపి దిగాడు. వాచ్‌మన్ భీముడు కారువైపు పరుగెత్తుకొచ్చాడు. నాగరాజు నలువైపులా చూశాడు. మరెవ్వరూ లేరు.

"భీమా, ఏం చేసేవు?"

"మీరు చెప్పినట్లే ఆడిని పాతేశానయ్యా" లోలోపల ఆశ్చర్యపడినా అతడు పైకి కనపర్చలేదు.

"ఎక్కడ పాతేవు?"

"రండయ్యా!" అని అతడు కదిలాడు.

భీముడు వెనకనే వెళ్ళాడతను. ఒకచోట అతడు ఆగాడు. తవ్వి, కప్పెట్టిన గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పైన ముక్కలు నాటబడినాయి.

ఆ ప్రదేశాన్ని చూస్తూ నాగరాజు ఆలోచించసాగాడు. ఫోన్ చేసినవాడు తనని మోసం చేయడానికి ప్రయత్నించాడు. తను భయపడనక్కరలేదు.

కాని మరో ఆలోచన తటాలున మెదడులో మెది

లింది. భీముడు తన్ని మోసం చేస్తున్నాడేమో!

"భీమా!"

"అయ్యా!"

"శవం జేబులో ఒక పత్రం వుంది. అది నాకు కావాలి! తొందరగా తవ్వు!"

"ఎవరేనా చూస్తారయ్యా."

"చూడకుండా జాగ్రత్తపడదాం."

భీముడు కదల్లేదు. అలాగే వుండిపోయాడు.

"ఈపాటికది వాసనకొడ్తూ ఉంటుందయ్యా."

"అయినా తప్పదు. ఆ పత్రం నాకు కావాలి."

"ఆ పని నేను చెయ్యలేనయ్యా. మరెవరినేనా తవ్వమనండి!"

నాగరాజా అతడివైపు సూటిగా చూశాడు.

"భీమా, నువ్వు వచ్చేసరికి యిక్కడ శవంలేదు. అవునా? నిజం చెప్పు!"

అతడు మాట్లాడలేదు.

"రాస్కెల్ నిజం చెప్పు!"

"మీరిస్తానన్న వెయ్యి కోసం అబద్ధమాడానయ్యా. నేనొచ్చేసరికి యిక్కడ శవంలేదు. ఎర్రటి మరకలు నేలమీదున్నాయి. గొయ్యి తవ్వి, పూడ్చి, పైన మొక్కల్ని నాటాను. అలా యింకెప్పుడూ చెయ్యను, నన్ను కాపాడండి."

"వెళ్ళి నీ పని చూసుకో" అన్నాడు నాగరాజా.

8

కారును రోడ్డు వారగా ఆపి నాగరాజా కిందకు దిగాడు.

అతడి చేతిలో పెద్ద బాగ్ వుంది. అతడు బ్లా

సూట్‌లో వున్నాడు. ఎర్రటి నెక్ టై కట్టుకున్నాడు.

కొంచెం దూరంలో పేవ్‌మెంటుమీద నిలబడిన వ్యక్తి నాగరాజువైపు పరీక్షగా చూశాడు. అతడు నల్లటి కళ్ళద్దాలు ధరించాడు. గడ్డం, వెడల్పాటి మీసాలు, తలమీద ఫెల్ట్ కాప్ ఉంది.

అతడి పక్కనే ఒక ఆంగ్లో ఇండియన్ యువతి నిలబడి ఉంది.

"లుక్, అతడే మన మనిషి!" అన్నాడతను.

"వెళ్ళనా?" అడిగిందామె.

"కొంతసేపు అతడిని నుంచోనియ్యి!"

సబ్‌వే మెట్లు దిగాడు నాగరాజు. లోపల లైట్లు వెలుగుతున్నాయి. ఒకచోట నిలబడి అతడు సిగరెట్ వెలిగించాడు. పొగ పీల్చి వదులుతున్నాడు.

అనేకమంది సబ్‌వేద్వారా యిటూ, అటూ కదులుతున్నారు. అతడు టైమ్ చూశాడు. మూడు అయింది.

ఒక యాంగ్లో ఇండియన్ యువతి మెట్లు దిగివచ్చింది. అతడి పక్కనుంచి పోతూ ఎర్రటి నెక్ టై చూసి ఆగింది.

"తెచ్చావా?" అడిగిందామె.

"తెచ్చాను" అని బాగ్‌ను ఆమెకిచ్చాడు.

బాగ్ తీసుకొని ఆమె వచ్చినవైపుకే వెళ్ళిపోయింది. నాగరాజు సబ్‌వే ద్వారా రెండో వైపుకు వెళ్ళాడు. ఆమెకోసం నలువైపులా చూశాడు.

ఆమె యెక్కడా కనపడలేదు!

అతను తన కారువైపు సబ్‌వేలోంచి వెళ్ళాడు. కూర్చుని తలుపుమూసి, కారును శరవేగంగా పోనిచ్చాడు.

నాగరాజు తన గదిలో పచార్లు చేస్తున్నాడు. టెలి

ఫోన్ మ్రోగింది. అతడు రిసీవర్ ఎత్తాడు.

"హలో నాగరాజు" అన్నాడు.

"మిష్టర్ నాగరాజ్, నువ్వు పంపిన బాగ్ అందింది. 25 లక్షలు ఉంది. గుడ్ బాయ్‌లా నేను చెప్పినట్లు చేశావు. నీకు యే ప్రమాదం రాదు" అన్నాడతను.

"మిష్టర్, ఆ శవం ఇంకా నీ దగ్గర వుందా?"

"వుంది. ఎంబామ్ చేయించి చెక్కపెట్టెలో వుంచాను."

"దాన్ని కాల్చేయి! అలాకాకపోతే యెక్కడో పాతించేయి! నువ్వు అడిగినది యిచ్చాను. నే కోరినది నువ్వు చెయ్యాలి" అన్నాడు నాగరాజు.

అటువైపున మనిషి గంభీరంగా నవ్వాడు.

"కొంతకాలం పోయాక నువ్వు చెప్పినట్లు చేస్తాను. అంతవరకూ నువ్వు ఓపిగ్గా ఉండాలి"

"ప్లీస్, వుంటాను."

అటువైపున రిసీవర్ పెట్టేయబడింది. నాగరాజు రిసీవర్ పెట్టేసి సోఫాలో కూర్చున్నాడు. గ్లాసులో విస్కీ పోసుకుని తాగేశాడు.

అతడు తనిచ్చిన డబ్బుతో తృప్తి పడేటట్లు లేడు. ఇంకా అడుగుతాడేమో! జీవితాంతం అతడికిలా చెల్లిస్తూనే వుండాలేమో!

అతడు లోలోపల విచారించసాగాడు. మోహన్ని షూట్ చేయడం తప్పయి కూర్చుంది. ఈ 25 లక్షలూ మోహన్‌కి పారేస్తే అతడు నోరు మూసుకుని వెళ్ళిపోయేవాడు. ఇప్పుడు పెనంలోంచి పొయ్యిలో పడినట్లుంది తన బ్రతుకు!

ఈసారి అతడు వచ్చి డబ్బడిగితే ఏదో ఒకటి చెయ్యాలి! ఏదో చేసి అతడిని నిర్మూలించాలి!

9

రోడ్డువారగా ఆమె కారు ఆపింది. తలుపు తెరిచి, నవ్వుతూ అతడామె పక్కనే కూర్చున్నాడు. తలుపు మూశాడు.

"హై, జానకీ!" అన్నాడతను.

"హై, రవీ!" అందామె.

కారు మెల్లిగా కదులోంది.

"ఎక్కడకు పోదాం?" అడిగిందామె.

"నువ్వే చెప్పాలి."

ఆమె తీయగా నవ్వింది. అతడామెవైపు ప్రేమతో చూశాడు. ఆమె చాలా అందమైన యువతి.

"రవీ, ఆకలిగా వుంది. టిఫిన్ తిని ఎక్కడికెళ్లాలో తర్వాత ఆలోచిద్దాం" అందామె.

"గుడ్ ఐడియా" అని అతడామె ఎడంచెయ్యి పట్టుకున్నాడు.

"నువ్వు చెయ్యి వదిలితేగాని నేను గేరు మార్చలేను" అందామె నవ్వుతూ!

అతడు చెయ్యి వదిలేశాడు. హోటల్ పిక్నిక్ కాంపౌండ్‌లో ఆమె కారు ఆగింది. ఇద్దరూ కిందకు దిగారు. ఒక టేబుల్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నారు.

బేరర్ రాగానే కావలసినవి ఆమె ఆర్డరిచ్చింది. అతడివైపు ఆమె నవ్వుతూ చూసింది. ఒకళ్ళనొకళ్ళు అలా చూసుకొంటూనే వుండిపోయారు.

ఆప్యాయంగా అతడామె చెయ్యి పట్టుకుని నిమిరాడు.

"జానకీ, మనం వెంటనే పెళ్ళి చేసుకుందాం" అన్నాడతను.

"నాన్నకు చెప్పాలి. ఆయన ఒప్పుకోవాలి!" అందామె.

"ఆయన వద్దంటే?" అడిగాడతను.

"ఆయన వద్దంటే మనం విడిపోవలసిందే!" అందామె నవ్వుతూ.

అతడామె చెయ్యి వదిలేశాడు. మొహాన్ని పక్కకు తిప్పుకున్నారు.

"అప్పుడే కోపం వచ్చేసింది నీకు!" అందామె కొంటెగా.

అతడామెవైపు చూశాడు.

"జానకీ, నువ్వు నా ప్రాణం. నువ్వు లేకుండా ఒక్క క్షణం కూడా నేను బ్రతకలేను. మనం విడిపోవలసిన పరిస్థితి ఏర్పడితే నే నీ లోకంనుంచే పోతాను."

"రవీ, అలా అంటే నేను ఏడుస్తాను," అందామె.

"ఐయాం సీరియస్" అన్నాడతను.

"నీ గురించి నాన్నతో చెప్తాను" అందామె.

"వెంటనే చెప్పు, జానకీ. నీ తండ్రి కోటీశ్వరుడు. నేను ధనవంతుడిని కాను. ఉద్యోగం చేసుకు బ్రతికే యువకుడిని. నా అమ్మా, నాన్నా ఏమయ్యారో నాకు వివరంగా తెలియదు. నేను ఒంటరివాడిని" అన్నాడతను.

ఇద్దరూ టిఫిన్ తింటూ మాట్లాడుతూ కూర్చున్నారు. బేరర్ బిల్ తెచ్చాడు. అతడికంటే ముందు ఆమె ప్లేటులో డబ్బు పడేసింది.

"పోదాం పద!"

ఇద్దరూ కారువైపు నడిచారు. ఆమె కారును బీచ్ వైపు పోనిచ్చింది.

చంద్రకాంతిలో యిద్దరూ ఒక పడవ పక్కన యిసుకలో కూర్చున్నారు. సముద్ర కెరటాలు హోరుమంటూ ముందుకొచ్చి, నురగలు కక్కుతూ వెనక్కు మళ్ళుతున్నాయి.

రవి నలువైపులా చూశాడు. సమీపంలో యెవ్వరూ లేరు. అమాంతంగా అతడామెను కౌగలించుకుని ముద్దెట్టుకున్నాడు.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"రవీ, నాన్న ఒప్పుకోకపోతే మన పెళ్ళి ఆగదు. నేను యిల్లు వదలి నీతో వుండడానికి వచ్చేస్తాను" అందామె.

ఉద్రేకంతో అతడి చేతులు ఆమెను చుట్టేశాయి.

"రవీ, ఇంతకుముందే నాతో నీ తలిదండ్రులు యేమయ్యారో తెలియదన్నావు. గుర్తుందా?"

"గుర్తుంది, జానకీ. అమ్మ చాలా మంచిది. నాన్న కూడా మంచివాడే. నన్ను అనాధాశ్రమంలో అమ్మ వదిలేసింది. అప్పటినుంచీ అమ్మా, నాన్నా ఏమయ్యారో నాకు తెలియదు" అన్నాడతను.

అతడి చేయిపట్టుకుని ఆమె నిమిరింది.

"నీ అమ్మా, నాన్నా మళ్ళా తిరిగొస్తారేమో!" అందామె.

"అలా తిరిగొస్తే అది మన ప్రేమ ఫలంగా భావించి ఆనందిస్తాను" అన్నాడు రవి.

ఆమె టైమ్ చూసింది. ఎనిమిది దాటింది.

"పోదామా!"

"అప్పుడే!"

"ఇలా యెంత సేపు కూర్చున్నా మనసు తనివితీరదు" అందామె.

"ఇద్దరు ఆ స్థితిలో వుండడాన్నే ప్రేమంటారు" అన్నాడు రవి.

ఇద్దరూ లేచి పక్క పక్కనే నడుస్తూ కారువైపు కదిలారు. లోపల కూర్చుని తలుపులు మూశాడు. ఆమె కారును పోనిచ్చింది.

10

నెల గడిచిపోయింది.

అతడు రిసీవరెత్తి "హలో, నాగరాజు!" అన్నాడు.

"మిష్టర్ నాగరాజ్, మోహన్ ఆఖరి కోర్కెను తీర్చవలసిన బాధ్యత నాది. నువ్వు 75 లక్షలు రెడీగా ఉంచు!" అన్నాడతను.

"నా యింట్లో డబ్బులు రాలే చెట్టుందా?"

"వుందేమో! మోహన్ వాటాకు కోటిపైన వస్తుందని నువ్వే చెప్పావట!"

"ఇదిస్తే అక్కడ ఆగుతావనే నమ్మకం ఏమిటి?"

"ఇది ఆఖరిసారిగా అడుగుతున్నాను. ఇటుపైన నిన్ను వేధించను. నువ్వు కోరిన ప్రకారం మోహన్ శవాన్ని పాతిపెట్టించేస్తాను."

"ఎలా యివ్వాలి?"

"పాత పద్ధతిలోనే. ఈసారి ఒక హిందూ యువతి నిన్ను కల్సుకుంటుంది. ఈసారి బ్లూ సెక్టై వేసుకో. రేపు రెండింటికి, సబ్ వేలో!"

"నిన్ను నమ్మి యిస్తున్నాను. ఇటుపైన నాకు మళ్ళా ఫోన్ చేయకూడదు."

"చెయ్యను."

నాగరాజు రిసీవర్ పెట్టేశాడు. అతడు అడిగింది పాకెట్సే శని వీరగడవుతుంది!

మర్నాడు రెండింటికి నాగరాజు వెళ్ళి బాగ్‌ను ఒక యువతికిచ్చాడు. వెనక్కి తిరిగి ఆమె వెళ్ళిపోయింది.

నాగరాజు తన కారువైపు నడిచాడు. కారులో ఇంటికి చేరుకున్నాడు. అతడు గదిలోకి అడుగుపెడ్తూంటే ఫోన్ మ్రోగింది.

అతడు రిసీవర్ని అందుకున్నాడు.

"హలో" అన్నాడు.

"మిస్టర్ నాగరాజ్, నీ మాట నిలబెట్టుకున్నావు. నాకిచ్చినది ఆ మోహన్‌కి యిచ్చివుంటే అతడు ఎంతో ఆనందించేవాడు. అదంతా గతం! ఇటువైపు నీకే బెంగా లేదు. నిన్ను మళ్ళా ఎప్పుడూ ఏమీ అడగను. ఆ శవాన్ని పాతిబెట్టించేస్తాను."

"థాంక్స్" అన్నాడు నాగరాజు.

రిసీవర్ని పెట్టేసి సోఫాలో కూర్చున్నాడు. గ్లాసులో విస్కీ పోసుకొని వుషారుగా తాగాడు.

గదిలోకొచ్చిన యువతి వైపు అతడు నవ్వుతూ చూశాడు.

"ఏం కావాలమ్మా?"

"నాన్నా, రవితో నాకు బాగా స్నేహమయింది. అతడు మనింటికొచ్చాడు. అమ్మను పరిచయం చేశాను. రవితో నువ్వు మాట్లాడు" అందామె.

"ఈ గదిలోకి రమ్మను" అన్నాడతను.

ఆమె వుషారుగా కిందకు వెళ్ళింది. రవితో పైకొచ్చి అతడిని తండ్రికి పరిచయం చేసి వెళ్ళిపోయింది.

ఎదురుగా కూర్చున్న రవివైపు అతడు నవ్వుతూ చూశాడు. ఏ యువతైనా అతడిని చూడగానే కలలుగనే సౌందర్యము, వ్యక్తిత్వం వున్నాయి రవిలో.

"నువ్వు ఏం చేస్తున్నావు?"

"శారదా టి. వి. కంపెనీలో యింజనీర్‌గా పని చేస్తున్నాను."

"మా అమ్మాయితో నీకు పరిచయమెలా అయింది?"

అతడు తీయగా నవ్వాడు.

"ఒక షాపులో ఆమె మర్చిపోయిన హేండ్ బాగ్‌ను నేను తీసుకెళ్ళి వాపసుచేశాను. అందులో చాలా డబ్బు వుందట. ఆ విధంగా మాకు పరిచయమైంది."

"మీ తలిదండ్రులు వున్నారా?"

"అమ్మ లేదు. నాన్నగారు యిన్నేళ్ళో దుబాయిలో ఉండి యీ మధ్యనే తిరిగివచ్చారు."

"ఆయన పేరు?"

"గణపతిరావుగారు."

అప్పుడే జానకి గదిలోకొచ్చింది. నాగరాజు ఆమె వైపు నవ్వుతూ చూశాడు.

"రవితో మాట్లాడేనమ్మా, చాలా?"

ఆమె కళ్ళు చిట్లిస్తూ తండ్రివంక చూసింది.

"రవీ, నేను ప్రేమించుకుంటున్నాం, నాన్నా."

"మంచిది."

"మీరు ఒప్పుకున్నట్టేగా?"

నాగరాజు కూతురివైపు సూటిగా చూశాడు.

"అమ్మాయి, ప్రేమించుకు నేవాళ్ళకు అడ్డు పడ్డం నాకిష్టంలేదు. త్వరలో నేను వెళ్ళి రవి నాన్నగార్ని కలుసుకొని మాట్లాడతాను."

"థాంక్స్ సార్! మీ మాటలు వింటుంటే ఆక్సిజన్ పీలుస్తున్నట్లుంది" అన్నాడు రవి.

రవి, జానకి బయటకు నడిచారు. ఇద్దరూ మెట్లు దిగుతున్నారు.

"మీ నాన్నగారు మంచి మూడ్‌లో వున్నారు" అన్నాడు రవి.

"ఏదో శుభవార్త నాన్నకు ఫోన్‌లో అందివుంటుంది. ఆ సమయంలో నాన్నను యేమడిగినా యిచ్చేస్తాడు" అందామె.

11

పెద్ద కాంపౌండులో కారు ఆగింది. నాగరాజు కిందకు దిగాడు. రవి అతడిని విశాలమైన హాల్లోకి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోమన్నాడు.

"నాన్నగార్తో చెప్తాను" అని రవి పైకి వెళ్ళాడు.

నాగరాజు హాలు నలువైపులా చూశాడు. రవితండ్రి తనలాగే ధనవంతుడయి వుండాలి! దుబాయిలో అతడు బాగా డబ్బు సంపాదించి వుంటాడు.

మెట్లమ్మట దిగుతున్న వ్యక్తిని చూసి నాగరాజు లేచాడు.

అతడు నాగరాజుతో కరచాలనం చేసి కూర్చోమన్నాడు.

"మీ గురించి రవి ఫోన్‌లో చెప్పాడు. అమ్మాయి జానకిని కూడా చూశాను. మంచిపిల్ల!" అన్నాడతను.

"ఆమె నా ఒక్కగానొక్క కూతురు" అన్నాడు నాగరాజు.

"రవి తప్ప నాకూ ఎవ్వరూ లేరు" అన్నాడతను.

రవి లోపలకు వెళ్లాడు.

"మా అమ్మాయిని మీ అబ్బాయి కిచ్చి పెళ్ళి చేయాలని నా ఉద్దేశం" అన్నాడు నాగరాజు.

"ప్రేమించుకున్న వాళ్ళకు మనం తప్పక పెళ్ళి చేయాలి" అన్నాడతను.

నాగరాజు అతడివంక నవ్వుతూ చూశాడు. అతడు నల్లటి కళ్ళద్దాలు ధరించాడు. పెద్ద గడ్డం. గుబురుగా పెరిగిన మీసాలు. తలమీద కాప్.

"అయితే ముహూర్తం పెట్టిస్తాను" అన్నాడు నాగరాజు.

"పెట్టించండి!"

క్షణకాలం యిద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"రండి పైకి వెళ్దాం" అన్నాడతను.

ఇద్దరూ మెట్లెక్కి పైకి వెళ్ళారు. విశాలమైన పడగదిలో యెదురెదురుగా సోఫాల్లో కూర్చున్నారు.

"మీరు దుబాయిలో యెన్నేళ్ళు ఉన్నారని విన్నాను" అన్నాడు నాగరాజు.

"వున్నాను."

"మీ కంఠం యెక్కడో విన్నట్లుంది" అన్నాడు. నాగరాజు.

అతడు నవ్వాడు.

"ఎక్కడ విన్నారు? ఫోన్‌లో వింటూరా?" అన్నాడతను.

నాగరాజు ఉలిక్కిపడ్డాడు. తనను బ్లాక్ మెయిల్ చేసి కోటి రూపాయిలు గుంజుకున్న వ్యక్తి కంఠమే అది! కోటి రూపాయిలు లాక్కొని, దానితో తృప్తిపడక తన కొడుకును జానకికి పెళ్ళిచేసి తతిమ్మాదికూడా మింగాలని అతడు ఆశిస్తున్నాడా?

"మీ కంఠం ఫోన్‌లో విన్నాను. చాలాసార్లు."

"వినుండొచ్చు."

నాగరాజు అమాంతంగా సోఫాలోంచి లేచాడు.

"యూ ఆరే బ్లాక్ మెయిలర్, నా కూతుర్ని నీ కొడుక్కి యివ్వను" అర్చాడతను.

"యూ ఆరే కిల్లర్! మోహన్ని చంపావు. అయినా వాళ్ళ ప్రేమకు అడ్డుపడలేదు. పెద్దల పాపాలకు పిల్లల్ని మనం శిక్షించకూడదు."

నాగరాజు అతడివైపు చూశాడు.

"నన్ను బ్లాక్ మెయిల్ చేసి యీ పెళ్ళి జరిపిస్తావా?" అన్నాడు నాగరాజు.

అతడు నాగరాజువైపు సూటిగా చూశాడు.

"ఈ పెళ్ళికోసం నిన్ను నేను బ్లాక్ మెయిల్ చేయను. నా మాటమీద నేను నిలుస్తాను."

"అయితే నే వెళ్తాను, గుడ్ బై" అన్నాడు నాగరాజు.

"ఆగు, యిలా ఒకసారి చూడు!"

నాగరాజు వెనక్కి తిరిగాడు. యెదుటి వ్యక్తివైపు చూసి స్తంభించిపోయాడు.

అతడికిప్పుడు కళ్ళద్దాలులేవు. గడ్డంలేదు. తలమీద కావ్ లేదు. యెదురుగా కూర్చున్న వ్యక్తి మోహన్!

నాగరాజు అతడి దగ్గరకెళ్ళి కాళ్ళమీద పడ్డాడు.

"మోహన్, నన్ను క్షమించు. నీకెంతో ద్రోహం చేశాను నేను!" ఏడుస్తూ అన్నాడు నాగరాజు.

"నాగా, నిన్ను క్షమిస్తున్నాను. ఆనాటి రాత్రి తోటలో యేదో నవ్వుచేసి నన్ను చంపడానికి ప్రయత్నిస్తావని ముందే వూహించాను. నీ బులెట్లు నాకు

తగలేదు. రక్తం చిమ్మినట్లు నీకు అగుపిస్తే నేను చచ్చానని నువ్వు వదిలేస్తావు. నా జేబులో ఉన్న రెడ్ సాల్యూషన్ పాకెట్‌ను గోరుతో పొడిచి అందులోని ద్రవాన్ని బయటకు వదిలేను. అదంతా చూసి నేను అనుకున్నట్లే నువ్వు కారులో వెళ్ళిపోయావు. నీ కారు వెళ్ళగానే నేను లేచి అక్కడనుంచి పారిపోయాను. అటుపైన జరిగినదంతా నీకు తెలుసు."

"మోహన్, నాకు చాలా ఆనందంగా వుంది నువ్వు బ్రతికి వున్నందుకు. నీకు అన్యాయం చేశానని నేను లోలోపల యెంతో బాధపడ్డాను."

"నాగా, నా భార్య పోయినా నా కొడుకు దొరికినందుకు యెంతో సంతోషిస్తున్నాను. గతాన్ని యిద్దరం మర్చిపోదాం. మనం యిటుపైన ప్రాణ మిత్రులుగా ఉందాం. రవీ, జానకీ సుఖంగా ఐక్యంగా, ఆనందంగా జీవించాలని దేవుడిని ప్రార్థిస్తూ వాళ్ళ పెళ్ళి జరిపించుదాం" అన్నాడు మోహన్.

"ఇటుపైన నువ్వు చెప్పినదే వేదం నాకు" అన్నాడు నాగరాజు.

—: సమాప్తం :—